# తెలిసీ తెలియని వాడు

పున్నయ్యకు కొత్త ఉద్యోగం వచ్చింది. అంటే అత గాడు అంతవరకూ నిరుద్యోగి అని కాదు. చేస్తున్న ఉద్యోగం కంటె రెట్టింపు పెద్ద ఉద్యోగం వచ్చింది. జీతానికి జీతం, హోదాకి హోదా రెండూ పెరిగాయి.

ఆ రూములో తనతోబాటు కుటుంబరావు, ఇంకా ఇద్దరు విద్యార్థులూ ఉంటున్నారు. కుటుంబరావూ, తనూ ఇంతవరకూ పనిచేస్తున్నది ఒకే ఆఫీసులో.

పున్నయ్య చిన్న తేనేటి విందు చేశాడు. విందులో పాల్గొన్న మిత్రులు కొంతమంది పున్నయ్యను అభినందిస్తూ ఉపన్యాసాలు చేశారు. పూలదండలు వేశారు. అలా వాళ్ళంతా హంగామా, హడావుడీ చేసి తమ సంతోషాన్ని వ్యక్తం చేసు కున్నారు. కుటుంబరావు మాత్రం అంతా వెళ్ళిపోయిం తర్వాత రూముకి తిరిగివస్తూ మెల్లగా పున్నయ్యకు మాత్రమే వినబడేటట్టుగా "చాలా సంతోషం పున్నయ్యా. నీకు జీవి తంలో ఓ లిఫ్ట్ లభించినందుకు అభినందిస్తున్నాను" అన్నాడు ఇంగ్లీషులో.

పున్నయ్య కూలింగు స్పెక్ట్సు కళ్ళకు తగిలించుకుని గంభీరంగా చిన్న ఉపన్యాసం ఇచ్చాడు. "చూడు కుటుంబ రావ్, ఇది ప్రపంచం. ఈ ప్రపంచంలో బ్రతకటానికి కొన్ని

పద్ధతులు, పంపిణీలు వున్నాయి. అది నువ్వూ, నేనూ ఏర్పాటు చేసినవి కావు. అనాదినుంచి వస్తూన్న పద్ధతులు. ఒకళ్ళతో మనకేంపని అనుకుంటే మనం ఎక్కడ వేసిన గొంగళి తంతుగా ఉన్నచోటునే ఉంటాం. కాస్త ఆశ్రయింపు, లంచం అను మామూళ్ళను కాస్త తినిపించటం, అవసరమైతే తినటం, ఇవన్నీ జీవితంలో ప్రాణావసరాలు. పదిమందికి ఉపకారంగా ఉండాలి. మనం ఒకరివల్ల ఉపకారం పొందాలి. ఎంత ప్రజ్ఞ చూపించకపోతే ఈ ఉద్యోగం దొరికిందంటావ్. ఇప్పటికైనా కాస్త నే చెప్పినట్టు విని పొరుషాంతు నేర్చుకుని కాస్త పెద్ద వాళ్ళ మంచి సంపాదించుకుని పైకి రావటానికి ప్రయత్నించు. ఈ కథలూ, కారుణ్యాలు వీటివల్ల ఏమీ ఉపయోగం లేదు. జీవితం నువ్వు రాసే కథల్లా ఉండదు, అదో పెద్ద సర్కస్ లాంటిది" అని చిన్నగా ఓసారి దగ్గి ఓసారి ముక్కు ఎగ పీల్చాడు పున్నయ్య.

ఈ కొత్త ఉద్యోగం వచ్చింతర్వాత పున్నయ్యలో మార్పు కొట్టవచ్చినట్టుగా కనిపించింది కుటుంబరావుకి అతను మాట్లాడే తీరూ, అతని అభిప్రాయాలు, అభిరుచుల స్థాయి చాలా మారిపోయింది. అయితే ఈ పరిణామం సహజమైందిగా భావించి కుటుంబరావు కొంతవరకూ అతని ధోరణికి సర్దుకుని పోయాడు.

ఆ రోజు పున్నయ్య కొత్త ఉద్యోగంలో ప్రవేశించే రోజు. ఇద్దరూ మామూలుగా బయలేరి సందు మొగలు విడి పోయేంందు పరిచయస్థు డొకడు తటస్థపడి ఇద్దర్నీ అపు

చేశాడు. పున్నయ్యకు సిగరెట్టు అందిస్తూ "కంగ్రాట్యులేషన్సు. నాకు నిన్ననే తెలిసింది" అన్నాడు.

"ఏం ఉద్యోగంరా. రాకపోయినా బాగుండేద" అన్నాడు పున్నయ్య.

"అదేవిటిరా. డబల్ ప్రమోషనులాంటి ఉద్యోగం. రెట్టింపు రాబడి. హోదాకి హోదా" అన్నాడతగాడు.

"ఎవరు సంతోషించాలని?"

"పెళ్ళిచేసుకుంటే పెళ్ళాం సంతోషిస్తుంది. అంత వరకూ మేం సంతోషిస్తాక. పద, నేనూ వస్తాను ఆఫీసు వరకూ. నిన్న అక్కడ దిగబెట్టి నా ఫ్రెండుకి పరిచయంచేసి నేనలా పోతాను. అక్కడ నీకు కొత్త లేకుండా అతగాడు తోడుగా ఉంటాడు."

పున్నయ్య ఓసారి కుటుంబరావు వైపు తిరిగి గట్టిగా చీదేసి, కాండ్రించి ఉమ్మేసి 'వస్తా' నంటూ మిత్రుడితో కలిసి చరచరా వెళ్ళిపోయాడు.

వెనకనుంచి "ఏం, ఏడుస్తున్నాడా" అన్న మిత్రుడి మాటలూ, 'ఇది లోకం భాయీ! నీకు తెలియందేముంది' అన్న పున్నయ్య సమాధానమూ కుటుంబరావు చెవిలో దూరి బాణాలు గుచ్చుకున్నట్టుగా మనసుని గాయపరిచాయి.

కుటుంబరావుకి రూములో పున్నయ్య ఇలాంటి ధోరణిలో రెండు మూడు రోజులనుంచి విసురుతున్న బాణాలు

తన్ని కాదు లే అనుకుని పట్టించుకోకుండా మసిలాడుగాని, ఇప్పుడతనికి తన్నిగురించే అతనిలా మాట్లాడుతున్నాడని తెలిసి పోయింది.

నిజానికి పున్నయ్యకు ఈ ఉద్యోగం వచ్చినందుకు కుటుంబరావు పెద్దగా సంతోషించిందీ లేదు, బాధపడిందీ లేదు. ఒకళ్ళు బాగుపడుతూంటే మంచి మనిషి ఏమను కుంటాడో, కుటుంబరావూ అలాగే సంతోషించాడు. పున్న య్యకు లభించిన ఈ ఉద్యోగానికి సంబంధించినంతవరకూ కుటుంబరావులో వ్యక్తం అయిన హావభావాలు మితంగానూ సహజంగానూ మాత్రమే ఉన్నాడు. అంతకంటే హడావుడిగా, భేషజంగా వ్యక్తం చెయ్యటం అతనికి తెలియక కాదుగాని, అతనికిలా వ్యక్తం చెయ్యటం కృత్రిమంగానూ, అలవాటులేని పద్ధతిగానూ అనిపిస్తుంది.

కుటుంబరావు తత్వం పున్నయ్యకు కూడా బాగా తెలుసు. ఒకటి రెండు సందర్భాలలో "కుటుంబరావు ఉత్త అమాయకుడు. వాడికేం తెలియదు. వాడికి ప్రపంచజ్ఞానం బాగా తక్కువ" అని విమర్శించే ధోరణిలో కుటుంబరావు నిర్లిప్త ధోరణిని ప్రస్తావించక పోలేదు.

అటువంటిది పున్నయ్య తన్ని గురించి యితర మిత్రుల ముందూ రూములో విద్యార్థులముందూ అతనికి లభించిన ఈ ఉద్యోగం గురించి తానేదో అసూయపడుతూన్నట్టు తానేదో కుళ్ళిపోతున్నట్టు ఎందుకిలా ప్రవర్తిస్తున్నట్టు?

ఓనాడు పొద్దున్నే కుటుంబరావు రావటం కాస్త ఆలస్యం అయింది. ఆరోజు పున్నయ్య రోజూ కంటెముందు లేచాడుకూడాను. పున్నయ్య లేచిన చాలాసేపటివరకూ కుటుంబరావు ఓచెంప పున్నయ్య తాను నిద్రలేచినట్టు సూచిస్తున్నాకూడా. లేవకుండా అలాగే బద్ధకంగా పడుకుని ఉండటం పున్నయ్య సహించలేకపోయాడు. ఇది మామూలే కదా అంటే పరిస్థితి వేరు తాను పెద్ద ఉద్యోగస్థుడు కుటుంబరావు చిన్న ఉద్యోగస్థుడూ. తనంతవాడు తాగి తిరుగుతూంటే మొద్దులాగ కుటుంబరావు అలా పడుకుని ఉండటం ఈనాడు కొత్తగాకపోయినా అది కావాలని కుటుంబరావు తన్ని నిర్లక్ష్యం చేస్తున్నట్టుగా పున్నయ్య ఫీలయిపోయి నాలుగూ దులిపేశాడు — చులకనగా "లే... లే... దారికడ్డంగా చాపుకుని పడుకుంటే తిరిగేవాళ్ళకు కాళ్ళూ చేతులూ విరిగిపో లేదనా?" అంటూను.

అక్కడున్న విద్యార్థులు తన్ని చూసి నవ్వుకుంటున్నట్టు, తన్ని హేళన చేస్తున్నట్టు ఫీలయాడు కుటుంబరావు.

"ఎన్నడూ లేంది ఇవాళంత కోపం దేనికి వచ్చినట్టు? నువ్వు ఇంతకంటే ఆలస్యంగా లేచిన సందర్భాలు లేవా ఏవిటి?" అన్నాడు కుటుంబరావు.

"సర్లే లేచి మొహం కడుక్కో" అన్నాడు పున్నయ్య, నీతో వాదించటం నాకు పరువు తక్కువన్నట్టుగా.

ఇలా అనవసరంగా అకారణంగా పున్నయ్య ప్రతి

చిన్న విషయంలోను, తనేదో అతన్ని చూసి అసూయపడుతున్నట్టు అలా అసూయపడటం తప్పించి తనకేమీ చేతకానట్టు అర్థం వచ్చేట్టుగా పదిమందిలోనూ నోటికొచ్చినట్టల్లా పేలుతూంటే కుటుంబరావు తగిన విధంగా సమాధానాలు యిచ్చాడుగాని, అవి పున్నయ్య ఉధృతాన్ని అరికట్టలేకపోయాడు. పైగా అతగాణ్ణి మరింత రెచ్చగొట్టాయికూడాను.

పున్నయ్య స్పష్టంగా వ్యక్తం చేసిందేమిటంటే— పున్నయ్య ఉద్యోగం చూసి ఏడవటం లేదని రుజువు చేసుకోవాల్సిన బాధ్యత తనదే అయినట్టు అందుకు తాను కొన్ని చర్యలు తీసుకుని పున్నయ్యలో కలిగిన అపోహను తొలగించవలసి ఉన్నట్టు కుటుంబరావుకి అర్థం అయింది. ఉదాహరణకు పొద్దున్నే లేవగానే యిదివరకుమల్లే యిద్దరూ కలిసి హోటలకి పోనక్కర్లేకుండా కుటుంబరావు ఒక్కడే మర్యాద కోసరం పున్నయ్యతోనూ హోటలకి వస్తానని అంటున్నా "తమరు వద్దు, ఫ్లాస్కు తీసుకువెళ్ళి నేనే కాఫీ తాగి, దాన్నిండా పోయించుకుని తెచ్చి నీకిస్తాను" అని అలా చేయాలి. పున్నయ్య తాలూకు మాసిపోయినబట్టలు తన బట్టలతోబాటు తీసుకువెళ్ళి లాండ్రీలో వెయ్యటం, తన బట్టలతోబాటే తీసుకురావటం చేస్తే చాలు. పున్నయ్య యింటికి తెచ్చే ఆఫీసుఫైళ్ళు చూసిపెట్టటం — యిలాంటివే చిన్న చిన్న అవకాశాలు ఆలస్యం చేయకుండా అంది పుచ్చుకుని తాను అతని ఉద్యోగం చూసి ఏడవటం లేదని రుజువు చేసుకోవాలి.

ఒక్కొక్కసారి కొన్నిరోజుల్లో పున్నయ్యలో వచ్చిన ఈ మార్పు రానురాను కుటుంబరావుకి బాధాకరంగా పరిణమించటమే కాకుండా అటు యిటు తేల్చుకోవాల్సిన పరిస్థితి వచ్చిపడింది. రూములో ఉండదల్చుకుంటే కుటుంబరావు పున్నయ్య అధిక్యతను గుర్తించాలి తప్పదు. పున్నయ్య ఆ విషయం కూడా స్పష్టం చేశాడు. అలా చెయ్యటమేకాకుండా ఒకరకమైన ఒత్తిడి కూడా చేశాడు.

ఓనాడు పున్నయ్య కుటుంబరావుని ఛడామడా తిట్టేశాడు ఏదో వంకమీద పెట్టుకుని. ఎవరినీ గాదో పెట్టి కుటుంబరావు ప్రవర్తన విద్యార్థుల ముందు తన్ని చిన్నబుచ్చేదిగా ఉందిట.

కుటుంబరావు పూరుకోలేదు. మళ్ళీ తిట్టాడు. విద్యార్థులు అడ్డుపడి వారించారు.

కుటుంబరావు తొందరపడి రూము ఖాళీ చెయ్యలేదు గాని రూములో తన బట్టలు, పెట్టె, తదితర సామగ్రి ఈ చివర్నించి ఆ చివరికి మార్చేశాడు ఇప్పుడు పున్నయ్యతో అతనికి మాటలు లేవు. అతనికీ పున్నయ్యకి మధ్య విద్యార్థులున్నారు పున్నయ్య రూములో ఉండే కాసేపూ వాళ్ళే అతనితో ఏవేవో కబుర్లలోకి దింపి అతగాని ధోరణి కుటుంబరావు మీదికి మళ్ళకుండా తప్పిస్తున్నారు.

చివరికి వాళ్ళకి విసుగెత్తి అందులో ఒకడన్నాడు: "పోనీ ఏంపోయింది. ఆఫైళ్ళు కాస్త చూసిపెట్టకూడదూ. ఏడేళ్ళ నుంచి ఒకచోట ఉంటున్నాడు" అన్నాడు.

కుటుంబరావు అడ్డంగా తల వూపుతూ "మీకు తెలియదు. అంతం లేకుండా తగాదాలు కొనసాగిస్తే మధ్య మీబోటివాళ్ళు అతణ్ణి మార్చలేక నామీదికి వచ్చి నాకే అతని కనుకూలంగా మారమని ఒత్తిడి చేస్తారని అతని ఎత్తు. ఈ దురాక్రమణ తత్వాన్ని మనం తృప్తిపరచలేం. ఈతత్వానికి అంతంటూ ఉండదు. పట్టించుకోకుండా మనమానాన మనం పోవటమే తగిన ఉపాయం" అన్నాడు.

వాళ్ళు ఎటూ చెప్పలేక వూరుకున్నారు.

ఓనాడు పొద్దున్నే-

పున్నయ్య హడావుడిగా పెట్టెబేడా సర్దుకుంటున్నాడు. ముఖంలో ఆందోళన ఛాయలు కన్పిస్తున్నాయి.

విద్యార్థి అడిగితే "ఆఫీసుకు దూరం అయింది దగ్గర్లో చూసుకుందామని అనుకుంటున్నా" అన్నాడు.

"నాలుగు రోజులక్రితం కూడా ఎవరు ఖాళీ చేసినా చెయ్యకపోయినా నేను మాత్రం ఖాళీ చెయ్యను అన్నారు గదా. ఇంతలో ఏమొచ్చింది" అని అతగాడు రెట్టించాడు.

"ఇంతకంటె సదుపాయంగా ఉన్న రూం దొరికింది." అని యిక ప్రశ్నలు వెయ్యటానికి అవకాశం ఇవ్వకుండా రిక్షా ఎక్కబోతూంటే "సాయంత్రం చిన్న తేనేటివిందు ఇవ్వాలని అనుకుంటున్నా. తప్పకుండా అయిదింటికల్లా హోటల్‌కి వచ్చెయ్యి" అన్నాడు కుటుంబరావు.

"ఏమిటి విశేషం?" అని అడిగాడు విద్యార్థి.

"ఉద్యోగంలో చిన్న ప్రమోషను వచ్చింది. అందుకని..." అన్నాడు కుటుంబరావు.

పున్నయ్య రిక్షాగాడే తొందరచేసి వెళ్ళిపోయాడు.

ఓ వారం పోయింతర్వాత ఓనాడు విద్యార్థి హడావుడిగా వచ్చి చెప్పాడు. "విన్నారా ఈ సంగతి. పున్నయ్య ఉద్యోగం పోయిందట. ప్రభుత్వంవారు కొన్ని పోస్టులు ఎత్తేశారుట. పాపం పున్నయ్య ఉద్యోగం ఆ విధంగా పోయింది" అని.

"మరి యింకోరూము ఆఫీసు దగ్గర చూసుకుంటున్నానని చెప్పారుగా."

"అదీ నిజమే. అక్కడే రెట్టింపు అద్దెతో యింతకంటె తక్కువ సదుపాయాలతో యింకోరూం చూసుకున్నాడు.

"అప్పటి కింకా ఉద్యోగం పోలేదు కాబోలు."

"ఉద్యోగం పోయిం తర్వాతనే కావాలనే మన రూమునుంచి వెళ్ళిపోయాడు. మనతో చెప్పిందంతా అబద్ధం."

"యిక్కడే ఉండొచ్చుగా" అన్నారొకరు.

"ఎలా వుంటాడు. కుటుంబరావుగారిని చూసి తాను ఏడవటం లేదని రుజువు చేసుకుందుకోసరం కుటుంబరావుగారి ఆధిక్యతని గుర్తించి లొంగిపోయి ఆతని బట్టలు లాండిలో వేసి తేవటం, పొద్దున్నే ఫ్లాస్కుతో కాఫీ తెచ్చి యివ్వటం, ఆయనగారి ఆఫీసు ఫైళ్ళు చూసిపెట్టటంలాంటి పనులు చెయ్యాలిగా మరి ఒకవేళ కుటుంబరావుగారు వూరుకున్నా మనం వూరుకోంగా. వూరుకుంటే చురుకు లేని మందగొడివాళ్ళం అయిపోతాం పున్నయ్యగారి థీరీప్రకారం" అన్నాడా విద్యార్థి చిన్నగా నవ్వుతూ.